క్లుప్తంగా

విద్యా సామగ్రి వితరణ

కురబలకోట: మండలంలోని అంగళ్లు గ్రామం మొలకవారిపల్లె ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం గుణగుంట్లవారిపల్లెకి చెందిన పి. వెంకటరమణ జ్ఞాపకార్థం అతని భార్య లక్ష్మీదేవి, కుమారుడు రమేష్ బాబు, అల్లుడు సాయి కృష్ణ పది వేల విలువ చేసే నోటుబుక్కులు , పలకలు, పెన్సిళ్లు, పెన్నులు అందజేశారు. 55 మంది విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేశారు.

నేడు టమాటా మండీలు, గొర్రెల సంతకు వేలం

కురబలకోట: మండలంలోని అంగళ్లు టమాటా మండీలు, గొర్రెల సంత, వారపు సంత గేటు వసూలు వేలం పాటలు బుధవారం ఉదయం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించనున్నట్లు గ్రామ సర్పంచ్ పోరెడ్డి విశ్వారెడ్డి, కార్యదర్శి శేషగిరి కుమార్ తెలిపారు. వేలం లో పాల్గొనదలచిన వారు ముందుగా నిర్ణీత డిపాజిట్టు చెల్లించి పాల్గొనాలని కోరారు.

ఘనంగా సంకష్టహర చతుర్థి వేడుకలు

మదనపల్లె సిటీ: స్థానిక దేవళంవీధిలోని సోమేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం సంకష్టహర చతుర్థి వేడుకలు ఘనంగా చేపట్టారు. అర్చకులు ఫణికుమార్‌శర్మ స్వామికి ప్రత్యేక అంకరణ చేసి అభిషేకం చేశారు. అలాగే బెంగళూరు రోడ్డులోని శ్రీ యోగభోగేశ్వరస్వామి ఆలయంలో సంకష్టహరి చతుర్థి వేడుకలు నిర్వహించారు.

అమ్మవారికి బోనాల సమర్పణ



బోనాలు తీసుకువచ్చిన మహిళలు

ములకలచెరువు: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద వెలసిన శ్రీ బోయకొండ గంగమ్మ అమ్మవారికి మంగళవారం మహిళలు బోనాలు సమర్పించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని భక్తి శ్రద్ధలతో మొక్కులు సమర్పించుకున్నారు.

ఉచిత మెగా వైద్యశిబిరానికి స్పందన



రోగులకు చికిత్స చేస్తున్న వైద్యులు

రామసముద్రం: రామసముద్రం మండల కేంద్రంలో మంగళవారం శ్రీవెంకటేశ్వర నర్సింగ్ హోం వెంకటచల క్లీనిక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరానికి అనూహ్య స్పందన లభించింది. శిబిరంలో డాక్టర్ వెంకటచల, ప్రముఖ వైద్యనిపుణులు పలు రకాల ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించారు. గుండెకు, కంటికి సంబంధించిన వైద్యులు ఎం.యశ్వంత్, నాగశ్రీ బాధితులకు పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. స్త్రీలకు సంబంధించిన వ్యాధులకు డాక్టర్ నాగజ్యోతి పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లకు సిఫారసు చేశారు.

బాలికలు సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలి



మాట్లాతున్న ఫోర్డు డైరెక్టర్ లలితమ్మ

మదనపల్లె సిటీ: బాలికలు చదవాలి, ఎదగాలి, సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఫోర్డు డైరెక్టర్ జల్లా లలితమ్మ తెలిపారు. మంగళవారం స్థానిక బార్ అసోసియేషన్‌లో క్రై సంస్థ, ఫోర్డు సంయుక్త ఆధ్వర్యంలో పూరి పదాయ్ దేశానికి భలాయ్ ప్రచారంలో భాగంగా కార్యక్రమానికి మద్దతు ప్రకటిస్తూ సంతకాల సేకరణలో పాల్గొని మద్దతు ప్రకటించారు. బాలికల విద్యను ప్రోత్సహిస్తూ జాతీయ స్థాయిలో చేపట్టిన మహోత్తరమైన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు టి.వెంకటరమణారెడ్డి, కార్యదర్శి బయ్యారెడ్డి, సభ్యులు సోమశేఖర్, గోపాలకృష్ణ, జనార్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డు మృతికి సంతాపం

కలికిరి: అనారోగ్యంతో హోంగార్డు మృతి చెందిన ఘటన కలికిరిలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు... కలికిరి పట్టణానికి చెందిన రమణ(45) జిల్లా కేంద్రం రాయచోటిలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. ఇతను అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం కలికిరి ప్రభుత్వాసుపత్రిలో మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పలువురు పోలీసు సిబ్బంది మృతదేహానికి నివాళులు అర్పించి సంతాపం తెలిపారు. కాగా మృతదేహాన్ని స్వగ్రామం తవళంకు తరలించి మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులున్నారు.

నకిలీ ఎరువులు విక్రయించే దుకాణాల లైసెన్స్ రద్దు చేయాలి



మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రంగారెడ్డి

గుర్రంకొండ: పట్టణంలో నకిలీ ఎరువులు విక్రయించే దుకాణాల లైసెన్స్‌లను వెంటనే రద్దు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి, సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు సాంబశివ డిమాండ్ చేశారు. మంగళవారం గుర్రంకొండలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఇటీవల మండలంలోని ఎల్లుట్ల పంచాయతీ శీలంవారి పల్లెకు చెందిన ఓ రైతుకు గుర్రంకొండ బస్టాండులోని ఓ ఎరువుల దుకాణం యజమాని నకిలీ ఎరువులు విక్రయించాడన్నారు. దీంతో రైతు పంట మొత్తం దెబ్బతిందన్నారు. కౌలుకు పొలం తీసుకొని టమాటా పంట సాగు చేసిన రైతు సుమారు రూ.3 లక్షలు ఖర్చు చేసి పంట సాగు చేశారన్నారు. నకిలీ డ్రిప్ ఎరువులతో పంట మొత్తం ఎరుపు రంగులోకి మారిపోయిందన్నారు. నకిలీ మందులు విక్రయిస్తున్న ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ అధికారుల నిఘా లేని కారణంగానే రైతులు నష్టపోతున్నారని ఆరోపించారు. గుర్రంకొండ పట్టణంలో ఇద్దరు బడా ఎరువుల దుకాణాల యజమానలు అనధికారికంగా ఎనిమిది గోడౌన్లను నిర్వహిస్తున్నారన్నారు. నకిలీ ఎరువులను సదరు గోడౌన్లలో స్టాకు ఉంచి రైతులకు విక్రయించి మోసాలకు పాల్పడుతున్నారన్నారు. అధికారులు వీటిపై నిఘా ఉంచి నకిలీ ఎరువుల అమ్మకాలకు కల్లెం వేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ నాయకులు, మురళీ,వెంకటేష్, రమణ, రైతులు పాల్గొన్నారు.

బీసీజీ టీకాతో క్షయ వ్యాధిని అరికడదాం



బీసీజీ టీకాలపై అవగాహన ర్యాలీ

నిమ్మనపల్లె : బీసీజీ టీకాతో క్షయ వ్యాధిని అరికడదామని టీబీ పర్యవేక్షకులు నాగిరెడ్డి అన్నారు. పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ రమేష్ బాబు, డాక్టర్ ప్రత్యూష పర్యవేక్షణలో మంగళవారం మండలంలోని సైదాపేట, బాలినాయన పల్లె లో, బీసీజీ టీకా, సికెల్ సెల్ అనేమియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. క్షయ వ్యాధి లేని సమాజం కోసం బీసీజీ టీకాలను ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది అన్నారు. వైద్య ఆరోగ్య సిబ్బంది గ్రామాలలో ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తూ క్షయ వ్యాధి నివారణ కోసం టీకాలు వేస్తున్నట్లు చెప్పారు. ప్రతి సోమ, గురువారాల్లో బీసీజీ టీకాలు ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉంటాయన్నారు. అర్హులైన వారు టీకా తప్పనిసరిగా వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ,ఆరోగ్య పర్యవేక్షకులు దేవేంద్ర, ఎల్.హెచ్.పి. అలివేలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

రెడ్డిశేఖర్ సేవలు అభినందనీయం



రెడ్డిశేఖర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

పెద్దతిప్పసముద్రం: స్థానిక సబ్ పోస్ట్ మాస్టర్ రెడ్డిశేఖర్ ప్రజలకు అందించిన సేవలు అభినందనీయమని మదనపల్లి పోస్టల్ ఏఎస్పీ నీలిమ కొనియాడారు. రెడ్డిశేఖర్ బి.కొత్తకోటకు బదిలీ అయిన సందర్భంగా మంగళవారం ఎస్‌వో పరిధిలోని బీపీఎంలు, జీడీఎస్ సిబ్బంది ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏఎస్పీ నీలిమ మాట్లాడుతూ రెడ్డిశేఖర్ పోస్టల్ ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు సిబ్బంది సహకారంతో కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన పోస్టల్ లక్ష్యాలను అధిగమించేలా కృషి చేసారన్నారు. సమావేశంలో కొత్తగా నియమితులైన ఎస్‌పీఎం రాజారెడ్డి ఉన్నారు. అనంతరం సిబ్బంది శాలువలతో సత్కరించారు.

తాగునీటి కోసం ఖాళీ బిందెలతో నిరసన



ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

ములకలచెరువు: స్థానిక కదిరి రోడ్డు ఉండే ప్రజలు తాగునీటి సమస్యను పరిష్కరించాలని మంగళవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. గత ఏడాది నుంచి తాగునీటి కోసం అలమటిస్తున్నా ఎవరూ పట్టించుకోలేదని మహిళలు వాపోయారు. సమస్యపై స్పందించిన ఎంపీడీవో పోలప్ప తాగునీటి ఎద్దడిని నివారించేలా చర్యలు చేపడతామని హామీ ఇవ్వడంతో మహిళలు ఆందోళన విరమించారు.

అంగన్‌వాడీ కేంద్రాలు సక్రమంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న సీడీపీఓ నాగవేణి

తంబళ్లపల్లె: అంగన్‌వాడీ కేంద్రాలను కార్యకర్తలు సక్రమంగా నిర్వహించాలని సీడీపీఓ నాగవేణి తెలిపారు. మంగళవారం ఐసీడీఎస్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ప్రతి కేంద్రం పరిధిలో గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు పౌష్టికాహారాన్ని సకాలంలో అందజేయాలన్నారు. పిల్లల పట్ల ప్రత్యేక చొరవ చూపి వారికి చదువు పట్ల ఆసక్తి కలిగే విధంగా ఆట, పాటలతో వారికి బోధన చేయాలన్నారు. విధి నిర్వహణలో అలక్ష్యం చేస్తే చర్యలు తప్పవన్నారు.

570 లీటర్ల మద్యం, నాటుసారా ధ్వంసం



పట్టుబడిన కర్ణాటక మద్యం, నాటుసారాను ధ్వంసం చేస్తున్న ఎస్ఈబీ సిబ్బంది

మదనపల్లె : ఎస్ఈబీ స్టేషన్, మదనపల్లె పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన 570 లీటర్ల కర్ణాటక, ఆంధ్ర మద్యం, నాటుసారాను జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు వాల్మీకి సమక్షంలో ధ్వంసం చేసినట్లు సీఐ రమేష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం చిప్పిలి విజయాడెయిరీ వెనుకవైపు నిర్మానుష్య ప్రదేశంలో మద్యం, నాటుసారాను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా సీఐ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ... నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్‌కు సంబంధించి 56 కేసుల్లో సీజ్‌చేసిన రూ.1,19,602 విలువచేసే 284.795 లీటర్ల కర్ణాటక మద్యం, పరిమితికి మించి తరలిస్తూ.. 8 కేసుల్లో సీజ్‌చేసిన రూ.21,410 విలువచేసే 27.18 లీటర్ల ఆంధ్ర మద్యం, 15 కేసుల్లో పట్టుబడిన రూ.77,190 విలువచేసే 257.03లీటర్ల నాటుసారాను ధ్వంసం చేసినట్లు తెలిపారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

కురబలకోట: రక్తదానం చేయడమంటే మరొకరికి ప్రాణ దానం చేయడమేనని వైద్యాధికారి జ్యోష్న చౌదరి, డాక్టర్ బద్రీ అన్నారు. తిరుపతి ఎన్టీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 60 మంది రక్తదానం చేశారు. అతిథులు మాట్లాడుతూ అన్ని దానాల కన్నా రక్తదానం గొప్పదన్నారు. దీనిని బాధ్యతగా భావించాలన్నారు. ఆసుపత్రిలో చేరే ప్రతి ఏడుగురిలో ఒకరికి రక్తం అవసరత ఏర్పడుతోందన్నారు. కానీ అర్హులైన వారిలో పది శాతం కంటే తక్కువ మంది మాత్రమే ఏటా రక్తదానం చేస్తున్నారన్నారు. ప్రిన్సిపాల్ యువరాజ్, డాక్టర్ చెన్నయ్య, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణపతి హోమం

నందలూరు : మండలంలోని రైల్వే కేంద్రంలోని రైల్వే ఇన్స్టిట్యూట్ పక్కనే కొలువైన వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో మంగళవారం సంకష్టహర చతుర్థి సందర్భంగా శ్రీ వరసిద్ధి వినాయక స్వామికి ఆలయ అర్చకులు నరసా రవిస్వామి ఆధ్వర్యంలో ఏకవార రుద్రాభిషేకం నిర్వహించారు. సాయంత్రం గణపతి హోమం, లక్ష్మీగణపతి, స్వేతార్క గణపతి హోమం నిర్వహించారు.

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ త్యాగరాజు

తంబళ్లపల్లె: ప్రభుత్వం చేపట్టిన నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా మండలంలోని బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని ఎంఈఓ త్యాగరాజు కోరారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల కమిటీ సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో పర్యటించి బడి ఈడు పిల్లలను గుర్తించాలన్నారు. తల్లిదండ్రులతో చర్చించి గ్రామాల్లో చైతన్య కార్యక్రమాలు నిర్వహించి వంద శాతం బడిఈడు పిల్లలను జూలై 12 లోపు బడిలో చేర్పించాలన్నారు. తహసీల్దార్ బ్రహ్మయ్య, ఎంపీడీఓ క్రిష్ణమూర్తి, ఎంఈఓ-2 నాగసుబ్బరాయుడు, హెచ్ఎంలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పీలేరు రూరల్ : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ కార్తీక్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని రేగళ్లులో మలేరియా వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా, డెంగీ వ్యాధులు వస్తాయన్నారు. కలుషిత నీరు, కలుషిత ఆహారంతో నీళ్ళ విరేచనాలు వచ్చే ప్రమాదముందని తెలిపారు. దోమల ఆవాసాలు అయిన నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని తెలిపారు. దోమ కాటుకు గురి కాకుండా పడుకొనే సమయంలో దోమల తెరలు వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి విద్యసాగర్, డాక్టర్ శైలజ, సీహెచ్‌వో జయలక్ష్మీ, హెచ్ఈ ఉషారాణి, సూపర్‌వైజర్ రమాదేవి, చిన్నప్ప, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆకాశాన్నంటిన కూరగాయల ధరలు



పీలేరు వారపుసంతలో కూరగాయలు

పీలేరు : ఏమి కొనలేం.. ఏమి తినలేం.. అనేటట్లుగా కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. మంగళవారం పీలేరులో జరిగిన వారపు సంతలో ఏ కూరగాయ ధర అడిగినా కిలో దాదాపు రూ. 100 పలికింది. ప్రధానంగా నాణ్యతను బట్టి కిలో టమాటాలు రూ. 70 నుంచి రూ. 100, వంకాయలు, పచ్చిమిరప, క్యారెట్, బీట్‌రూట్, బెండ, చిక్కుడు, బీన్స్, బీరకాయలు, రూ. 100, కాకర కాయలు రూ. 120, ఉల్లిపాయలు రూ. 50, కొత్తిమీర కట్ట రూ. 80, ఆకు కూరలు కట్ట రూ. 20 నుంచి రూ. 30 పలికాయి. అల్లం, తెల్లగడ్డలు కేజీ రూ. 250 పలికాయి. సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఏమి కొనలేని పరిస్థితి నెలకొంది.

ఉపాధ్యాయుల పీఎఫ్ సమస్యలు పరిష్కరించాలి

రాయచోటి అర్బన్ : నూతనంగా ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ అయ్యి కొత్త డీడీఓ కోడ్‌లు కేటాయింపబడిన పాఠశాలల ఉపాధ్యాయుల పీఎఫ్ వారి వ్యక్తిగత ఖాతాలలోకి జమచేయులగా తగిన చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి జాబీర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన యూటీఎఫ్ నేతలతో కలసి జిల్లా సహాయ ఖజానా అధికారి ఖాదర్‌వలీని కలుసుకుని మాట్లాడారు. 2023లో విద్యార్థుల సంఖ్య ఆధారంగా పలు ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా మారుస్తూ ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులను డీడీఓలుగా నియమిస్తూ కోడ్‌లను కేటాయించారన్నారు. 2023 జూన్ నుంచి ఆయా పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల వ్యక్తిగత ఖాతాల్లోకి పీఎఫ్ జమ కావడం లేదన్నారు. జెడ్పీ సిబ్బందిని అడిగితే కొత్త ఉన్నత పాఠశాలల డీడీ కోడ్‌లు తమ కార్యాలయం పరిధిలోని ఆన్‌లైన్‌లో చూపడం లేదంటున్నారన్నారు. ఈ విషయాన్ని ఖజానా శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలంటూ కోరారు. గత సంవత్సరం జూన్ నెల నుంచి వందలాది ఉపాధ్యాయుల లక్షలాది రూపాయల పీఎఫ్ సొమ్ము వారి వ్యక్తిగత ఖాతాలలో జమ కావడానికి ఆటంకంగా మారిన సాంకేతిక పరమైన సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు.

అశ్వ వాహనంపై ఊరేగిన వేణుగోపాలస్వామి

పెనగలూరు (ఓబులవారిపల్లె) : వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం జరిగిన హరికథ ఆకట్టుకుంది. తిరుపతికి చెందిన షణ్ముకి హరిదాసు మహిశాసుర మర్దినీ అనే కథను ఆసక్తికరంగా చెప్పారు. ఆర్యవైశ్య సంఘం వారు ఉభయదాతలుగా హరికథా కాలక్షేపాన్ని ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం ధ్వజా అవరోహణ, వసంతోత్సవం కార్యక్రమాలు జరిగాయి.

మారిన జీవనశైలితోనే గుండెజబ్బులు

- సకాలంలో గుర్తిస్తే ప్రాణాలు కాపాడే అవకాశం
- క్లిష్ట సమస్యలకు ప్రపంచస్థాయి చికిత్స
- కార్డియాలజిస్ట్ లక్ష్మీకాంత్



గుండెజబ్బులపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ లక్ష్మీకాంత్, తదితరులు

మదనపల్లె : మారుతున్న జీవనశైలి, రెగ్యులర్ వ్యాయామం చేయకపోవడం, స్మోకింగ్, షుగర్, బీపీ వ్యాధులు కలిగి ఉండటం, ఫ్యామిలీలో హార్ట్‌ఎటాక్ రిస్క్ కారణంగా చిన్నవయస్సులోనే ప్రజలు గుండెజబ్బుల బారిన పడుతున్నారని అపోలో హాస్పిటల్స్ కార్డియాలజిస్ట్ డాక్టర్.లక్ష్మీకాంత్ అన్నారు. మంగళవారం పట్టణంలోని గుప్తా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో గుండెజబ్బులు- ఆధునిక చికిత్సా విధానాలపై అపోలో హాస్పిటల్స్, బన్నే రిఘట్ట ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్. పి.లక్ష్మీకాంత్ మాట్లాడుతూ...ప్రపంచదేశాలతో పోలిస్తే భారతదేశంలో పదేళ్ల ముందుగానే హార్ట్‌ఎటాక్స్ సంభవిస్తున్నాయన్నారు. హార్ట్‌ఎటాక్ సంభవించిన వ్యక్తిని గంట(గోల్డెన్‌అవర్)లోపు అందుబాటులో ఉన్న ఆస్పత్రిలో చేర్పించి, ఈసీజీ, ఎకో కార్డియోగ్రామ్ తీయించి, మేజర్ హార్ట్ ఎటాక్‌గా నిర్ధారిస్తే తదనుగుణంగా చికిత్స అందించాల్సి ఉంటుందన్నారు. గతంలో రక్తనాళాల్లో పేరుకుపోయిన వాటిని తొలగించేందుకు మందులు ఇచ్చి, స్టెబిలైజ్ తర్వాత యాంజియోగ్రామ్ చేసే పద్ధతి ఉండేదన్నారు. ప్రస్తుతం క్యాథ్‌ల్యాబ్ అవకాశాలు మదనపల్లెలో ఉన్న నేపథ్యంలో..దాదాపు 50శాతం కేసులకు ప్రాథమికంగానే చికిత్సలు అందించడం జరుగుతోందన్నారు. అయితే మిగిలిన 50శాతం కేసులకు సంబంధించి అవసరమైన చికిత్స విధానాలు, ఆధునిక పరికరాలు అందుబాటులో లేకపోవడంతో విలువైన ప్రాణాలు కోల్పోవాల్సి వస్తోందన్నారు. రక్తనాళాల్లో కాల్షియం పేరుకుపోయిన కేసుల్లో స్టంట్ వేసి పెద్దది చేయడం కుదరదని, ఇలాంటి వాటికి ఆధునిక చికిత్సా విధానాలైన కటింగ్ బెలూన్, రోటావేషన్, ఇంట్రావాస్కులర్ లితొట్ ట్రిప్సి తదితరాలను ఉపయోగించి చికిత్స చేయవచ్చన్నారు. నేటితరం వైద్యులు ఆధునిక వైద్యవిధానంలో వస్తున్న మార్పులు, యంత్రపరికరాలపై అవగాహన పెంచుకుని, ప్రజలకు అందించేందుకు కృషి చేయాలన్నారు. గుండెజబ్బుల బారిన పడకుండా ఉండాలంటే ప్రతిరోజు 45 నిమిషాలు వాకింగ్ చేయడం, ఆరోగ్యకరమైన ఆహారాలు తీసుకోవడం, పిజ్జా,బర్గర్, కూల్‌డ్రింక్స్‌కు దూరంగా ఉండటం, చికెన్, చేపలను ఆహారంలో చేర్చుకోవడం, కూరగాయలు అధికంగా తీసుకోవడం, లిక్కర్, ఆల్కహాల్, టొబాకో తదితరాలకు దూరంగా ఉండాలన్నారు. వీటిని ప్రతి వ్యక్తి పాటిస్తే, భవిష్యత్తులో గుండెజబ్బులు రాకుండా మనల్ని మనం కాపాడుకునే వీలు ఉంటుందన్నారు. సమావేశంలో అపోలో ఆస్పత్రి వైద్యులు డాక్టర్.వెంకటరత్నం, డాక్టర్.రుషికేష్, డాక్టర్.ఆదిత్యలు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ



మాట్లాడుతున్న ఎంపీడీఓ రామక్రిష్ణయ్య

కలికిరి: గ్రామాల్లో పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీడీఓ రామక్రిష్ణయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పారిశుధ్యం, తాగునీటి సమస్యలపై మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధులు ప్రబలే అవకాశం పొంచి ఉన్నందున ముందస్తు జాగ్రత్త చర్యగా గ్రామాల్లోని ఓవర్ హెడ్ ట్యాంకులు శుభ్రపరచాలని, పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. అలాగే తాగునీటి సమస్యపైనా దృష్టి సారించాలన్నారు. పలు గ్రామాల్లో తాగునీటి బోర్లు అడుగంటి సమస్య తలెత్తిందని, అవసరమైన చోట నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ పరుశురాం, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా వెంకటేశ్వరస్వామి ఉట్ల తిరునాల



కల్యాణ వెంకటేశ్వరస్వామికి పూజలు చేస్తున్న దృశ్యం

రామసముద్రం: రామసముద్రం మండలం మినికి గ్రామంలో వెలసిన శ్రీకళ్యాణ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం ఘనంగా ఉట్ల తిరునాల నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర్‌బట్టర్, సురేష్ బట్టర్ ఆగమికులు త్రివిక్రమ్ ఉట్లోత్సవంనకు గ్రామ పెద్దలు, గ్రామస్తుల ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఉట్ల తిరునాలను తిలకించడానికి చుట్టు పక్కల గ్రామాల నుంచే కాక కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఉట్లోత్సవాన్ని తిలకించారు. భక్తులకు గ్రామస్తులు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. రాత్రి గ్రామంలో శ్రీకళ్యాణ వెంకటేశ్వరస్వామిని ఊరేగించారు. ఇంటింటా మహిళలు కర్పూర హారతులు అందించి మొక్కులు చెల్లించుకున్నారు.

డ్రాప్ అవుట్స్ లేకుండా చర్యలు చేపట్టండి



స్టూడెంట్ కిట్ల స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న ఏఎల్ఎస్‌సీఓ చంద్రశేఖర్ నాయక్

నిమ్మనపల్లె : మండలంలో ఎక్కడ డ్రాప్ అవుట్స్ లేకుండా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని జిల్లా సెక్టోరియల్ అధికారి, ప్రత్యామ్నాయ పాఠశాలల సమన్వయకర్త చంద్రశేఖర్ నాయక్ అన్నారు. మంగళవారం నిమ్మనపల్లెలోని స్టూడెంట్ కిట్ స్టాక్ పాయింట్, రెడ్డివారిపల్లె జడ్పీ హైస్కూల్, బండ్లపై ప్రాథమిక ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. స్టూడెంట్ కిట్లను పరిశీలించారు. పాఠశాలలకు కిట్ల పంపిణీ పై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అన్ని గ్రామాల్లో డ్రాప్ అవుట్స్ లేకుండా పూర్తిస్థాయిలో ఎన్రోల్మెంట్ జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. తల్లిదండ్రులకు సరైన అవగాహన కల్పించి డ్రాప్ అవుట్స్ కచ్చితంగా ప్రభుత్వ పాఠశాలలో చేరేలా పనిచేయాలన్నారు. స్టూడెంట్ కిట్ల పంపిణీ పూర్తి చేసి, మరిన్ని కిట్లు అవసరం అయితే వెంటనే ప్రతిపాదనలు పంపించాలని అధికారులకు సూచించారు. రెండవ విడతలు పూర్తిస్థాయిలో పుస్తకాలు నోట్ బుక్ లు,స్టూడెంట్ కిట్లు అందజేస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు పెంచాలని అన్నారు.కార్యక్రమంలో ఎంఈవోలు ఎంఆర్ పద్మావతి నారాయణ ఎం ఐ ఎస్ కోఆర్డినేటర్ నరసింహులు సౌజన్య సీఆర్పీలు సుధాకర్ పద్మనాభం స్వాతి మంజుల పాల్గొన్నారు.